క్లుప్తంగా

మైనార్టీ కార్పొరేషన్‌కు నిధులు పెంచాలి

కొల్లాపూర్: మైనార్టీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల శాతాన్ని పెంచాలని ఆవాస్ సంఘం నాయకుడు సలీం కోరారు. గురువారం ఆయన సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.120 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. రాష్ట్రంలోని మైనార్టీల జనాభాను దృష్టిలో ఉంచుకుని రూ.1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకునే ప్రతి యువకుడికి జీవనోపాధి కోసం రుణాలు ఇవ్వాలన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

కల్వకుర్తిరూరల్: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీ రాములు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని తర్నికల్ చెందిన శ్రావణికి మంజూరైన రూ.19వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ

బిజినేపల్లి: మండలంలోని గంగారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు హరీశ్వర్‌రెడ్డి క్రీడా సామగ్రిని గురువారం అందించాడు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక, మానసిక ఎదుగుదలకు చదువులు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, రత్న, శేఖర్, రాజప్ప, యాకుబ్‌అలీ, కుర్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలోని 12వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన సిద్ది పెంటమ్మ కుటుంబాన్ని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం పరామర్శించారు. అదేవిధంగా 6వ వార్డులో కార్వాముల రఘు దినకర్మలో ఆయన పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు రమ్యకుమారి, శిరీషయాదవ్, రహీంపాష ఉన్నారు.

ఘనంగా మడేలేశ్వర స్వామి ఉత్సవాలు



అచ్చంపేట: పట్టణంలో మడేలేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడు, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు మనోహర్, వైస్ చైర్‌పర్సన్ శైలజ, మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 9న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ: మండలంలోని బైరాపూర్ చెందిన గోరుట్ల మధుసుదన్ అనుమతి లేకుండా ఇసుకను మండల కేంద్రానికి తరలిస్తుండడంతో గురువారం పోలీసులు అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అందని ధాన్యం డబ్బులు



కొనుగోలు కేంద్రానికి వరిధాన్యాన్ని ట్రాక్టర్లలో తరలిస్తున్న రైతులు (ఫైల్)

- నెల రోజుల క్రితం కొనుగోలు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- పెట్టుబడికి తప్పని తిప్పలు

కోడేరు: ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు కష్టాలు తీరడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన వారం రోజులకే రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని అధికారుల చెప్పినా క్షేత్ర స్థాయిలో జమ కాలేదు. ధాన్యం అమ్మి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు జమ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులను అడిగితే మేము ఇక్కడి నుంచి ఆన్‌లైన్‌లో పంపామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

మండల వ్యాప్తంగా 17కొనుగోలు కేంద్రాలు

మండల వ్యాప్తంగా సింగిల్ విండో ఆధ్వర్యంలో 16, ఐకేపీ ఆధ్వర్యంలో ఒక కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. కోడేరు సింగిల్ విండో ఆధ్వర్యంలో 12 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,053 మంది రైతుల నుంచి 1.60లక్షల బ్యాగులు ధాన్యం కొనుగోలు చేశారు. 800మంది రైతులకు ధాన్యం డబ్బులు వారి ఖాతాలో పడగా మిగతా వారికి పడకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ్రావుపల్లి, ఎత్తంలో రెండు కేంద్రాలు ఉండగా 235మంది రైతులకుగాను కొండ్రావుపల్లి 32వేల బ్యాగులు, ఎత్తం 42వేల బ్యాగులు కొనుగోలు చేయగా 140మంది రైతులకు డబ్బులు జమ అయ్యాయి. మిగతా 25మంది రైతులకు డబ్బులు జమ కాలేదు. అదే విధంగా నర్సాయిపల్లి, మైలారం రెండు కొనుగోలు కేంద్రాలు ఉండగా 415మంది రైతులకు గాను 28వేల క్వింటాళ్లు అధికారులు కొనుగోలు చేశారు. 10మంది రైతులకు ఇప్పటి వరకు డబ్బులు పడలేదు. మండల వ్యాప్తంగా 300మంది రైతులకు ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదు.

పెట్టుబడికి తిప్పలు

కొనుగోలు కేంద్రకాల్లో నెల రోజుల వరకు అమ్మకాలు చేశారు. దీంతో రైతులు ధాన్యానికి కాపలా ఉన్నారు. ధాన్యం అమ్మి నెల రోజులు అవుతున్నా పూర్తిస్థాయిలో డబ్బులు రాకపోవడంతో పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వరి నాట్లు ప్రారంభం కావడంతో పెట్టుబడి కోసం కూలీలు, ఎరువులకు డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చే పరిస్థితి ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం అమ్మిన డబ్బులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

> **రెండు రోజుల్లో జమ అవుతాయి**
>
> ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించిన రైతులకు సంబంధించిన డబ్బులు కొందరికి మాత్రమే ఖాతాలో జమ కాలేదు. రెండు రోజుల్లో అందరికి వారి ఖాతాలో జమ అవుతాయి. రైతులు ఆందోళన చెందవద్దు.
>
> – ప్రకాష్‌రెడ్డి, సీఈఓ

నిధులు విడుదల చేసి ఆదుకోవాలి



నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన నిధులు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.35వేల కోట్ల నిధులు మంజూరు చేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల పరిస్థితి దయనీయంగా మారిందని, ప్రజలకిచ్చిన హామీల కోసం సొంత డబ్బు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పెద్దన్న యాదవ్, నిరంజన్ యాదవ్, శ్రీను, లక్ష్మయ్య, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



దోమలపెంట(అచ్చంపేట): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ హెచ్–64 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జెన్‌కో హైడెల్ డైరెక్టర్ వెంకటరాజం గురువారం ఈగలపెంటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెన్‌కో ఈడీ రామ్మోహన్, కేంద్రం సీఈ సూర్యనారాయణ, నాగిరెడ్డి, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎస్‌ఐ కల్యాణ్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, తోట రాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం క్యాలెండర్ క్లబ్ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు హాజరై విడుదల చేశారు.



అభ్యసన సామగ్రితో బోధన చేయాలి



తెలకపల్లి: తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనాభ్యాసన సామగ్రి ఉపయోగించి వల్ల సులభతరంగా అర్థమవుతుందని డీఈఓ గోవిందరాజులు అన్నారు. గురువారం మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి తొలిమెట్టు బోధనాభ్యాసన సామగ్రి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ, ఎంపీపీ మధు, జెడ్పీటీసీ సుమిత్ర హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనాభ్యాసన సామగ్రిని వారు స్వయంగా పరిశీలించారు. విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. 30 పాఠశాలల నుంచి తెలుగు, ఆంగ్లం , గణితం, సామాన్యశాస్త్రం వారిగా మేళలో పాల్గొన్నారు. మొత్తం 280రకాల సామగ్రిని ప్రదర్శించారు. అన్ని సబ్జెక్టులలో 12ఉత్తమ టీఎల్‌ఎంలను జిల్లా స్థాయిలో నిర్వహించే మేళకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

ముమ్మరంగా చవుట చెరువు పనులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని చవుట చెరువుపై రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.6కోట్ల వ్యయంతో చవుట చెరువుపై రోడ్డు విస్తరణ చేపట్టి మరో వైపు మినీ ట్యాంక్‌బండ్ కోసం పనులు చేపట్టారు. గతంలో రోడ్డు చిన్నదిగా ఉండడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ పనులు పూర్తయితే సమస్య పరిష్కారమవుతుంది.



విద్యార్థుల నైపుణ్యాలకు ప్రాక్టికల్స్ కీలకం



బిజినేపల్లి: విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి కళాశాలలో నిర్వహించే ప్రాక్టికల్స్ కీలకమని జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలోని పాలెం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ కళాశాల ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్స్ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ప్రాక్టికల్స్‌లో రాణించి అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, అధ్యాపకులు ఉన్నారు.

బురద రోడ్లకు మరమ్మతు



కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రోడ్లకు కంకర వేసి మరమ్మతులు చేపట్టారు.

టీఎల్‌ఎం మేళా పరిశీలన



తాడూరు: మండలంలోని ఇంద్రకల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాను గురువారం ఎఫ్‌ఎల్‌ఎస్ రాష్ట్ర నోడల్ అధికారి సువర్ణవినాయక్ సందర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సులభతరంగా బోధన చేయడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, నోడల్ అధికారి తిరుపతయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆర్డీటీపై అసత్య ప్రచారం తగదు

బల్మూర్: నిరుపేదలకు నాణ్యమైన ఇళ్లు ఉచితంగా నిర్మించి ఇస్తున్న ఆర్డీటీ సంస్థపై అసత్య ప్రచారాలు తగవని లబ్ధిదారులు అన్నారు. మండలంలోని బాణాల గ్రామానికి చెందిన ఆర్డీటీ ఇళ్ల లబ్ధిదారులు గురువారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈనెల 31న గ్రామానికి వచ్చిన అధికారులకు కొంత మంది ఇళ్ల నిర్మాణంలో నాసిరకం ఇసుక, ఇతర సరుకు ఉపయోగిస్తున్నారని తప్పుడు సమాచారం ఇవ్వడంతో అధికారులు ఇసుకను పరిశీలిస్తున్నట్లు ఫొటోలు దిగి పత్రికల్లో(సాక్షి కాదు) ప్రకటించడం తగదన్నారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఆర్డీటీ వారు పదేళ్లుగా గ్రామంలో ఆదుకుంటున్నారని, ఇలాంటి ప్రచారంతో పేదల నోట్లో మట్టి కొట్టవద్దని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 68 ఇళ్లు సర్వే చేసి అర్హులకు కట్టిస్తున్నారని, ఇందులో నాణ్యతలో ఎలాంటి లోపాలు లేవన్నారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉప్పునుంతల: పొలంలో స్ప్రింకర్లు, నల్లాలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ గురువారం తెలిపారు. మండలంలోని దాసర్లపల్లిలో కంచె పెద్దలక్ష్మయ్య పొలంలో గ్రామానికి చెందిన గోవు కృష్ణయ్య, అతని కుమారుడు గోవు శివశంకర్ కక్షపూరితంగా స్ప్రింకర్ పైపులు, నల్లాలు ధ్వంసం చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



భూ సమస్యల ఫిర్యాదులను పరిశీలిస్తున్న అధికారులు

చారకొండ: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై వివరాలను సేకరించి త్వరలో పరిష్కరిస్తామని ఆర్డీఓ రాజేష్ కుమార్ అన్నారు. మండలంలోని జూపల్లిలో గురువారం రైతుల పొలాలు ధరణి మార్పు అనంతరం వివిధ కారణాలతో ఆన్‌లైన్ నమోదు, మ్యూటేషన్, ఓఆర్‌సీ పట్టా, విరాసత్ ఇతర సమస్యలపై పంచాయతీ కార్యలయంలో రెవెన్యూ అధికారులు సదస్సు ఏర్పాటు చేశారు. సమస్యలను త్వరలో పూర్తి చేస్తామని రైతులతో ఆర్డీఓ మట్లాడారు.

కోడేరు: భూసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్డీఓ హనుమనాయక్ అన్నారు. గురువారం మండలంలోని నాగులపల్లిలో భూసమస్యలపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ హనుమనాయక్, తహసీల్దార్ మల్లికార్జున్ రావు హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఏ రైతు కూడా కార్యాలయం చుట్టూ తిరగరాదని సూచించారు. ధరణిలో రైతుల భూమి సర్వే నంబర్, మిస్సింగ్, విస్తీర్ణంలో తేడా, రైతుల పేర్లు తప్పులు ఉంటే మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాగులపల్లిలో 44మంది రైతులకు భూసమస్యలు ఉంటే అక్కడిక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. సిబ్బంది సమయ పాలన ప్రకారం విధులకు హాజరు కావాలని సూచించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న వీరయ్య

నాగర్‌కర్నూల్ రూరల్: దేశవ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు సాధనకై చలో ఢిల్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు వీరయ్య పిలుపునిచ్చారు. గురువారం ప్రజా సంఘర్ష యాత్రను జిల్లా కేంద్రంలో నిర్వహించారు. బస్ డిపో నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ఫలితంగా దేశంలో రవాణా రంగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని అన్నారు. బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు రాయితీలు కలిపిస్తున్న కేంద్రం దేశ వ్యాప్తంగా 50కోట్ల మంది నమ్ముకొని బతుకుతున్న రవాణా కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో రామయ్య, శ్రీకాంత్, శ్రీనివాసులు, ఆంజనేయులు, బిక్షపతిగౌడ్, కురుమూర్తి, రాజు, వెంకటయ్య, బాలస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలోని రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. గురువారం పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంఘర్షణ యాత్ర పట్టణానికి చేరుకుంది. యాత్రకు లారీ డ్రైవర్స్ అసోసియేషన్, ఆటో, ఆర్టీసీ యూనియన్, భవననిర్మాణ రంగ కార్మికులు స్వాగతం పలికారు. మహబూబ్‌నగర్‌చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మాట్లాడారు. మోటారు వాహనాల చట్టం 2019 నష్టదాయకంగా మారిందన్నారు. చట్టాన్ని సవరించి కార్మికులను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, రమేష్, శ్రీకాంత్, ఆంజనేయులు, మహేష్‌గౌడ్, జంగయ్య, నయీం, యాదయ్య, మల్లయ్య, బాల్‌రెడ్డి, పరిపూర్ణం పాల్గొన్నారు.

ఏపీజీవీబీ మొబైల్ ఏటీఎం ప్రారంభం



మొబైల్ ఏటీఎంను ప్రారంభిస్తున్న ఏపీజీవీబీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్

కందనూలు: ఏపీజీవీబీ మొబైల్ ఏటీఎంను గురువారం జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ కార్యాలయం వద్ద చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో తమ బ్యాంకు ముందుందన్నారు. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో నాబార్డు సౌజన్యంతో మొబైల్ ఏటీఎంను ప్రారంభించామని, రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. అనంతరం రూ.1.15 కోట్లు విలువ గల ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం షణ్ముఖం, భీమ్‌సేన్‌రావు, సుధీర్‌రావు, జిలాని, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాల భవన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కళాశాల భవనంలో పాఠశాల నడవడం వల్ల ఇంటర్ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వన్‌టైం పాఠశాల, కళాశాల నడవడం వల్ల సిలబస్ పూర్తి కావడం లేదున్నారు. కార్యక్రమంలో అభిలాష్, కిరణ్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో వరిసాగు సులభం

కోడేరు: యాసంగిలో రైతులు డ్రమ్ సీడర్ ద్వారా వరిసాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీరాం అన్నారు. గురువారం మండలంలోని మైలారం గ్రామంలో రైతు వేదిక వద్ద డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గుతాయని అన్నారు. పీఎం కిసాన్ డబ్బుల కోసం ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలన్నారు. అనంతరం రైతు బీమా, రైతు బంధు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

బల్మూర్: డ్రమ్ సీడర్ పరికరంతో వరి విత్తే విధానంపై గురువారం బాణాల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు క్షేత్ర ప్రదర్శనతో అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి మహేష్‌కుమార్ రైతులకు డ్రమ్ సీడర్ వినియోగంపై సూచనలు ఇచ్చారు. ఒక రైతు రోజుకు 8ఎకరాల్లో విత్తనం విత్తుకోవచ్చని పంట కాలం కూడా వారం తగ్గుతుందన్నారు. మండలంలోని బాణాల, పోలిశెట్టిపల్లి, బల్మూర్, కొండనాగుల, గట్టుతుమ్మెన్‌లో నాలుగు చొప్పున డ్రమ్ సీడర్లు రైతుల కోసం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శివకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఉప్పునుంతలలో ఆర్థికసాయం అందిస్తున్న యాదవ నాయకులు

ఉప్పునుంతల: మండలంలోని జప్తీ సదగోడులో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన కొట్టం మహేష్ యాదవ్ కుటుంబాన్ని గురువారం యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మల్లేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు శంకర్‌యాదవ్ పరామర్శించారు. గ్రామస్తులు, సంఘం సభ్యుల సహకారంతో రూ. 1.88లక్షల నగదు కుటుంబ సభ్యులకు అందజేశారు. యాదవుగా ఐక్యంగా ఉండి ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవాలని సూచించారు. శ్రీను, లింగమయ్య, శేఖర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: గ్రామంలోని చెంచు కాలనీకి చెందిన మర్రిపల్లి సుల్తాన్ తేనె, అటవి ఉత్పత్తులను సేకరించి కుటుంబాన్ని పోషించుకునేవాడు. గతంలో తేనె సేకరిస్తున్న క్రమంలో కాలుజారి కొండపై నుంచి కింద పడిపోయాడు. కొంత కాలంగా అనారోగ్యానికి గురైన నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ గురువారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

అమ్రాబాద్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం బాగుంటుందని సర్పంచ్ దాసరిలక్ష్మమ్మ తెలిపారు. గురువారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. చెంచుకాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేసి వీధుల వెంట ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ సిబ్బంది పెద్దులు, సురేష్‌గౌడ్, ఇస్మాయిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన రోడ్లు

- నిర్వహణ కొరవడిన బీటీ రోడ్లు
- మట్టి రోడ్లపై గోతులు
- ఏళ్ల తరబడిగా మరమ్మతుకు నోచుకోని వైనం



కోతకు గురైన ఉప్పునుంతల - మర్రిపల్లి బీటీ రోడ్డు



అధ్వానంగా తయారైన తాడూరు-ఉప్పునుంతల బీటీ రోడ్డు

ఉప్పునుంతల: మండలంలో గ్రామాలను కలుపుతూ ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఏళ్ల తరబడిగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. రోడ్లను బాగుచేయించడంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టింపులేకుండా ఉంది. రోడ్లకు ఇరువైపుల కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. గతంలో మెటల్ రోడ్లుగా వేసి తర్వాత పట్టించుకోకపోవడంతో కంకర తేలి వెళ్లడం కష్టంగా మారింది.

మట్టి రోడ్లు మరింత..

మండలంలో గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు మరింతగా అధ్వానంగా తయారయ్యాయి. ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ రోడ్డు, ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్, మొల్గర- ఉప్పునుంతల రోడ్ల వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజి వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న రోడ్డు వెంట కంకర తేలింది. ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు ఉన్న మట్టిరోడ్డుపై గోతులుపడ్డాయి. దాసర్లపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు, శ్యాండ్ క్వారీ రోడ్డు నుంచి కొరటికల్ వరకు, కొరటికల్ నుంచి చాకలిగుడిసెల వరకు మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయ్యవారిపల్లి నుంచి తండా వరకు మట్టి రోడ్లు దారుణంగా ఉన్నాయి. అదేవిధంగా కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. కాంసానిపల్లి తండా నుంచి రంగంపేట మీదుగా ఉన్న మెటల్ రోడ్డుపై వేసిన కంకర తేలింది.

తూతూ మంత్రంగా మరమ్మతు

మండలంలోని బీటీ రోడ్ల వెంట తూతూ మంత్రంగా నిర్వహణ పనులు చేస్తున్నారు. కొన్నేళ్లుగా నిర్వహణ లేక ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి వరకు బీటీ రోడ్డు ధ్వంసమై గోతులు పడింది. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పే పరిస్థితి ఉంది. తాడూరు నుంచి ఉప్పునుంతల వరకు వేసిన బీటీ రోడ్డు కంకర తేలి పూర్తిగా ధ్వంసమైంది. ఈరటాణిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తండా వరకు ఉన్న బీటీ రోడ్ల నిర్వహణ పనులు చేపట్టడంలేదు.

మిషన్ భగీరథతో ధ్వంసం

మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ కోసం వీధుల వెంట పైపులైన్లు వేశారు. దీంతో సీసీ రోడ్లు, మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధతో రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> **కాంట్రాక్టర్లు రావడం లేదు**
>
> మండలంలో 6 బీటీ రోడ్ల రెన్యూవల్ పనులు మంజూరు కాగా, వాటికి టెండర్లు నిర్వహించినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వాటిలో సీబీతండా, ఈరటాణిపల్లి– పెనిమిళ్ల, పెనిమిళ్ల– పూర్యానాయక్ తండా, తిర్మలాపూర్ రోడ్లు ఉన్నాయి. మరికొన్నింటికి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. మెటల్, మట్టి రోడ్ల మరమ్మతులకు ఉన్నతాధికారులు ఎటువంటి ప్రతిపాదనలు అడగలేదు.
>
> – సందీప్‌రెడ్డి, పీఆర్ ఏఈ